సమాచారం

రేపు జాయింట్ ఐడెంటిఫికేషన్ క్యాంప్

కీసర: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మైనార్టీ వర్గాలకు రుణాల పంపిణీ నిమిత్తం ఈ నెల 27వ తేదీ సోమవారం ఉదయం 11.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ ఐడెంటిఫికేషన్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రమాదేవి తెలిపారు. బ్యాంక్ అధికారులు, మైనారిటీ శాఖ అధికారులు క్యాంప్‌కు హాజరుకానున్నారని, ఈ మేరకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా క్యాంప్‌కు హాజరుకావాలని ఆమె సూచించారు.

క్లుప్తంగా

పీఎం ఎఫ్ఎంఈను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఏపీఎం తార్యానాయక్

ఘట్‌కేసర్: ప్రధాన మంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైసెస్ (పీఎం ఎఫ్ఎంఈ)ను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇందిర క్రాంతి పథకం ఏపీఎం తార్యానాయక్‌తో కలిసి శనివారం డ్వాక్రా మహిళల సబ్సిడీ రుణాలపై ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న డ్వాక్రా మహిళల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పీఎం ఎఫ్ఎంఈ ద్వారా పొదుపు సంఘంలో సభ్యత్వమున్న మహిళలకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు సబ్సిడీతో రుణం ఇప్పిస్తుందన్నారు.

వైఎస్సార్‌టీపీ జిల్లా కార్యదర్శిగా మునగాల రాజేంద్రవిష్ణుకిషోర్



కీసర: వైఎస్సార్‌టీపీ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శిగా నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీకి చెందిన మునగాల రాజేంద్ర విష్ణుకిషోర్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి నియామక పత్రాన్ని రాజేంద్ర విష్ణుకిషోర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కోఆర్డినేటర్ వాడుక రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలను శుభ్రం చేయాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రమాదేవి

ఘట్‌కేసర్: ప్రజల కోసం కేటాయించిన పార్కు స్థలాలను శుభ్రంగా ఉంచాలని సర్పంచ్ రమాదేవి అన్నారు. చౌదరిగూడ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి గౌతమి అధ్యక్షతన శనివారం జరిగిన పాలకవర్గ సమావేశంలో గ్రామాభివృద్ధిపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సాదత్ అలీగూడ గ్రామంలో డ్రైనేజీకి మరమ్మతులు చేయించాలని, మక్త గ్రామానికి వీధి దీపాలు వేయించాలని, లీకేజీలకు మరమ్మతులు చేయించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ రామారావు ముదిరాజ్, ఉప సర్పంచ్ మహేందర్ గౌడ్, వార్డు సభ్యులు భోజిరెడ్డి, సుధాకర్, స్వామిదాస్, లక్ష్మణ్, శంకర్‌గౌడ్, సంయుక్త, వాణి పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు




సూచనలిస్తున్న సర్పంచ్ సురేందర్ ముదిరాజ్

మేడ్చల్: గ్రామంలో కుక్కల నియంత్రణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు గౌడవెల్లి సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ తెలిపాడు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, సమస్య తీర్చాలని గ్రామస్తులు విన్నవించడంతో ఆయన గ్రామ పంచాయతీ కార్యాలయంలో వెటర్నరీ, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించి కుక్కల నియంత్రణకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయాలని సూచించారు. సమావేశంలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మేడ్చల్‌రూరల్: అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి బస్టాప్‌లో మరణించిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కండ్లకోయలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ వివరాల ప్రకారం.. కండ్లకోయ చౌరస్తాలో ఉన్న బస్టాప్‌లో ఓ వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను ఆరా తీయగా మృతుడు లారీ గైడ్‌గా పనిచేసుకుంటూ హోటల్లో తింటూ రాత్రి వేళల్లో బస్టాప్‌లో నిద్రిస్తాడని వివరించారు. సుమారు 50 ఏళ్లకు పైగా ఉన్న మృతుడు అనారోగ్యంతో మరణించి ఉంటాడని, మృతుడి వివరాలు తెలియరాలేదని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

బీఆర్ఎస్ అంటే బీజేపీకి వణుకు

- ప్రతీ కార్యకర్తకు అండగా నిలుస్తాం
- నిరుద్యోగులకు అన్యాయం జరగొద్దనే పరీక్షలను రద్దు చేశాం
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- అలియాబాద్‌లో మేడ్చల్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం
- పల్లాతో పాటు పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వణుకుపుడుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ జిల్లా పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శామీర్‌పేట్ మండలంలోని అలియాబాద్‌లో గల సీఎంఆర్ కన్వెన్షన్‌లో శనివారం మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు మంత్రి మల్లారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డిలు పాల్గొని ప్రసంగించి కార్యకర్తల్లో ఉత్తేజం నింపారు.



సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తలను పట్టించుకోవడం లేదు...

బీఆర్ఎస్ పార్టీలో కార్యకర్తలు, ఉద్యమకారులకు విలువ లేకుండా పోయిందని పలువురు సమావేశంలో తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏళ్ల నాటి నుంచి పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని కొత్తగా పార్టీలో చేరిన వారికి పదవులు కట్టబెడుతున్నారని, తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో సైతం పార్టీని ఇన్వాల్వ్ చేయడం లేదన్నారు. పై, కింది స్థాయిలో కార్యకర్తలు బాగానే ఉన్నా మధ్యలో ఉన్న నాయకుల వల్లే పార్టీలో విభేదాలు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా రైతు సమన్వయకర్త నందారెడ్డి, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, రాష్ట్ర కార్యదర్శి జహంగీర్, మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్, మేయర్లు, చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

"సీఎం కేసీఆర్ వల్లే తెలంగాణ ఏర్పడింది : ఎమ్మెల్సీ పల్లా



ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని, వచ్చిన తెలంగాణను దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చేశామని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నా రు. సంక్షేమం, అభివృద్ధి పథకాలను రాష్ట్రంలోని ప్రతి నిరుపేద లబ్ధిదారులకు, అన్ని వర్గాల వారికి అందించి న్యాయం చేశామని, కానీ పార్టీ కార్యకర్తలు మాత్రం నష్టపోయారన్నారు. తమ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం నిబద్ధతతో పనిచేసిందే కానీ.. పార్టీ లాభం కోసం పని చేయలేదన్నారు. అక్రమంగా ఏ కార్యకర్తకు ఉద్యోగాలు ఇవ్వలేదని, దళితబంధు, డబుల్ బెడ్రూం వంటి ఏ పథకం లోనైనా పారదర్శకత చూపించామని చెప్పారు. అన్ని అర్హతలుండి కూడా కార్యకర్తలు సంక్షేమ పథకాలకు, పదవులకు నోచుకోలేదని, పార్టీ కోసం పనిచేసిన ప్రతీ కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీక్ వ్యవహారాన్ని ప్రభుత్వమే పసిగట్టిందని, నిరుద్యోగులకు అన్యాయం జరగొద్దనే ఉద్దేశ్యంతోనే పరీక్షలు రద్దు చేశామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.లక్షల కోట్లు అదానీ వంటి బడా బాబులకు అప్పజెప్పిందని, దేశ వ్యాప్తంగా ఇతర పార్టీలపై అక్రమంగా సీబీఐ, ఐటీ, ఈడీ దాడులు చేయిస్తూ బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. రానున్న రోజుల్లో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పోటీ చేస్తుందన్నారు. రాష్ట్రంలో కొందరు ఇతర పార్టీల రాజకీయ నాయకులు, సోషల్ మీడియా వేదికగా బ్లాక్‌మెయిల్ చేసే వారు తమ పార్టీని తిడుతున్నారని, అలాంటి వారికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ప్రతి గులాబీ కార్యకర్తకు ఉందన్నారు. పార్టీలో సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలనే ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని పల్లా తెలిపారు.

"రాజకీయాల్లో అలక తగదు: మంత్రి మల్లారెడ్డి



రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సోషల్ మీడియాలో తప్ప ప్రజల్లో లేవని మంత్రి మల్లారెడ్డి ఆరోపించారు. సబ్జెక్ట్ లేని వ్యక్తులు పార్టీ అధ్యక్షులు కావడంతో ఇష్టం వచ్చినట్లుగా వారు మాట్లాడుతున్నారని, ఇలాంటి వారికి బీఆర్ఎస్ కార్యకర్తలు దీటుగా సమాధానం చెప్పాలన్నారు. తాను ఎమ్మెల్యే, మంత్రి అయ్యాక పార్టీ కార్యకర్తలు, ఉద్యమకారులకు తన వంతు న్యాయం చేశానన్నారు. పదవులు రానివారు అగొద్దని, రాజకీయాల్లో అలిగి కూర్చుంటే వచ్చేదేమీ ఉండదని సూచించారు. పార్టీలోని ప్రతీ కార్యకర్తకు న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.

"బీఆర్ఎస్ గెలుపునకే పనిచేద్దాం: ఎమ్మెల్సీ రాజు



పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారందరికీ తగిన న్యాయం జరుగుతుందని, ఇందుకు కొంత సమయం వేచి ఉండాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మరోమారు బీఆర్ఎస్ ప్రభుత్వం గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



విద్యార్థినులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న మంత్రి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసుకుని బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టే విద్యార్థినులు ఉద్యోగాలకు పరిమితం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్, ఇతర రంగాల్లో విజయాలు సాధించడంతో శనివారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థుల ఆలోచనలు మారాలని, యాపిల్ కంపెనీ వంటి వారు టెక్నాలజీని వినియోగించుకుని వారు తయారు చేసే ఫోన్లకు 4జీ, 5జీ అంటూ డబ్బులు సంపాదిస్తున్నారని ఉదహరించారు. ఇంజినీరింగ్ చదివేందుకు వచ్చే విద్యార్థులకు చదువు చెప్పి డిగ్రీ పట్టాలు ఇవ్వడమే కాకుండా వారిని ఉద్యోగాలతో బయటికి పంపుతున్న ఘనత మల్లారెడ్డి కళాశాలకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మనవరాళ్లు రితికారెడ్డి, శ్రీయారెడ్డిలు చిన్న వయస్సులో పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన అనుభవాలను విద్యార్థినులతో పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవిలత, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఆ డైలాగ్ నా గుండెల్లోంచి వచ్చింది.. అందుకే ఫేమస్ అయ్యింది'
– మంత్రి చామకూర మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఈ మధ్య కాలంలో తన జీవిత అనుభవాలను గుర్తు చేస్తూ.. మంత్రి మల్లారెడ్డి నోటి నుంచి వచ్చి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్న పాలమ్మినా.. పూలమ్మినా.. స్కూళ్లు, కాలేజీలు పెట్టినా.. కష్టపడ్డా.. సక్సెస్ ఐనా.. డైలాగ్‌ను గురించి శనివారం స్వయంగా ఆయనే విద్యార్థినులకు వివరించారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థినులు జీవితంలో ఎలా ఎదగాలో చెప్పుకొచ్చారు. ప్రస్తుతం చిన్న పిల్లాడి నుంచి ముసలి వారి వరకు తన డైలాగ్ చెబుతున్నారని, ప్రపంచ వ్యాప్తంగా వైరల్ కావడానికి కారణం ఆ డైలాగ్ నా గుండెల్లోంచి వచ్చిందని అన్నారు. తన జీవితంలో సాధించిన విజయాలను వివరిస్తూనే తెలిపానని, మీరు కూడా జీవితంలో తనకన్నా గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. దీంతో విద్యార్థినులు కేరింతలు, చప్పట్లు కొట్టారు.

బీజేపీ ధర్నాకు తరలిన నాయకులు

మేడ్చల్: నగరంలో బీజేపీ తలపెట్టిన ధర్నాకు మేడ్చల్ నుంచి బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మేడ్చల్ మున్సిపాలిటీ, మండల బీజేపీ నాయకులు మేడ్చల్‌లో సమావేశమై తమ వాహనాల్లో మేడ్చల్ నుంచి ర్యాలీగా నగరానికి వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మండల, మున్సిపాలిటీ నాయకులు ఉన్నారు.


గుండ్లపోచంపల్లి నేతలు సైతం...

మేడ్చల్‌రూరల్: నగరంలోని ఇందిరాపార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన నిరుద్యోగ మహాధర్నాకు గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీజేపీ నాయకులు తరలివెళ్లారు. రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు హంసారాణి, అమరం సరస్వతి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నాగరాజు, నరేందర్, సరిత, విజయలక్ష్మిలు ధర్నాకు వెళ్లారు.



మేడ్చల్‌లో ముమ్మరంగా పన్నుల వసూలు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారు వెంటనే చెల్లించాలని కమిషనర్ రాములు కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొని బకాయి ఉన్న వారికి ఇంటికి వెళ్లి ఆయన పన్నులు వసూలు చేశారు. వంద శాతం పన్నుల వసూలుకు మున్సిపల్ ప్రజలు సహకరించాలని కోరారు. ట్రేడ్ లైసెన్సులు లేని వ్యాపారులు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని, లైసెన్సులు పొందాలని సూచించారు. నెలాఖరు వరకు పన్నులు చెల్లించి పెనాల్టీలు లేకుండా చూసుకోవాలని ఆయన కోరారు.



వైస్ చైర్మన్ రమేష్ నుంచి పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్

సీతారాములను దర్శించుకున్న తహసీల్దార్



స్వామివారిని దర్శించుకున్న తహసీల్దార్ గౌరీవత్సల్య

కీసర: కీసరలోని శ్రీసీతారామచంద్ర స్వామిని శనివారం కీసర తహసీల్దార్ గౌరీవత్సల్య దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన తహసీల్దార్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా స్వామి వారికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బెలిదే రమేష్‌గుప్తా, ఆలయ కమిటీ సభ్యుడు ఆనబోయిన జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కీసరలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణపక్షంలో సర్పంచ్ మాధురి

కీసర: చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం వల్ల అనారోగ్య సమస్యలు దరిచేరవని కీసర ఎంపీడీఓ రమాదేవి అన్నారు. శనివారం గోధుమకుంట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా (మిల్లెట్స్) చిరుధాన్యాలపై కల్పించిన అవగాహనలో ఆమె పాల్గొని పిల్లలు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కీసరలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణపక్షంలో సర్పంచ్ నాయకపు మాధురి, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, యాద్గార్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణపక్షంలో సర్పంచ్ పుట్టరాజు, ఎంపీటీసీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చిరుధాన్యాలు తీనడం వల్ల కలిగే ప్రయోజనాలను చిన్నారులు, తల్లులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కిరణ్‌జ్యోతిప్రవీణ్, ఉపసర్పంచ్ సోమని ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల సత్తా



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

మేడ్చల్: ఆలిండియా ఒలింపియాడ్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షా ఫలితాల్లో గుండ్లపోచంపల్లిలోని శ్రీచైతన్య విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడంతో యాజమాన్యం వారిని అభినందించారు. 466 మంది పరీక్షలు రాయగా పాఠశాలకు చెందిన సాయికుమార్ టాపర్‌గా నిలవగా వరుసగా 2, 3, 5 స్థానాల్లో విద్యార్థులు నిలిచారు.

మల్లారెడ్డి ఫార్మసీ కళాశాలలో క్రీడలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఫార్మసీ కళాశాలలో క్రీడోత్సవ్ 2023 పేరిట శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ తుల్జారాణి క్రీడా పోటీలను ప్రారంభించగా అనంతరం వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు కబడ్డీ, క్రికెట్, త్రోబాల్, చెస్, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, పీడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు నాగవైష్ణవి



నాగవైష్ణవిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు నిర్మల తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ రాంపల్లి ప్రభుత్వ పాఠశాల్లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని నాగవైష్ణవి తైక్వాండో పోటీల్లో సత్తాచాటింది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల ఘట్‌కేసర్‌లో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన త్వైకాండో రాష్ట్ర స్థాయి సబ్–జూనియర్ పోటీల్లో (అండర్ 41 కేజీ) విభాగంలో రాంపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన నాగవైష్ణవి బంగారు పతకం సాధించి ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం కోటలోని ఇండోర్ హాల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ యూనివర్సిటీలో జరిగే 36వ జాతీయ స్థాయి సబ్–జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2022–23కు ఎంపికైందని పాఠశాల హెచ్ఎం నిర్మల తెలిపారు. ఈ మేరకు విద్యార్థినితో పాటు కోచ్ మధుసూదన్, పీఈటీ మనోహర్‌లను హెచ్ఎం అభినందించారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో శనివారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఎంఆర్ కళాశాల వైద్యులు కృత్రిమ శరీరంతో విద్యార్థులకు సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. ప్రతీ ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, సీఈఓ అభినవ్‌రెడ్డి, పీఆర్వో దుర్గాప్రసాద్‌రెడ్డి, వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మంత్రి మల్లారెడ్డికి ఆహ్వానం



మంత్రి మల్లారెడ్డి, నవీన్‌మిట్టల్‌లకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

కీసర: భక్తుల కొంగు బంగారంగా పేరొందిన చీర్యాల శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయ 15వ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 14 నుంచి 17వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం మంత్రి మల్లారెడ్డికి బ్రహ్మోత్సవాలకు రావాలంటూ ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీకి, ఆర్థిక రిజిస్ట్రేషన్ల శాఖ చీఫ్ ల్యాండ్ కమిషనర్ నవీన్‌మిట్టల్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ హనుమంతరావు, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్‌లకు కూడా ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీకి సన్నద్ధం!

- జిల్లాలో పంపిణీ చేయాల్సిన గొర్రెల యూనిట్లు 1296
- ఏప్రిల్ నుంచి ఆగస్టు చివరి నాటికి అందించేలా పశు సంవర్ధక శాఖ కసరత్తు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని లబ్ధిదారుల రెండేళ్ల ఎదురు చూపులకు తెర



సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపుతూ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ నెలలో గొర్రెల పంపిణీ మొదలు పెట్టి ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం నిర్ణయంతో మిగిలిన లబ్ధిదారులకు మేలు చేకూరనుంది. కుల వృత్తులకు జీవం పోయాలని నిర్ణయించిన ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గొల్ల, కురుమలకు రాయితీపై గొర్రెలను పంపిణీ చేసి ఉపాధి చూపిస్తోంది. గొల్లకురుమలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం 2017 ఏప్రిల్‌న గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాయితీపై రెండు విడతలుగా వీటిని పంపిణీ చేయాలని నిర్ణయించింది.

ఇప్పటికే 5,160కి 3,865 యూనిట్ల పంపిణీ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో ఎంపీడీఓ, తహసీల్దార్, పశువైద్యాధికారుల బృందం లబ్ధిదారులను డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లాకు మొదటి, రెండో విడతలు కలిపి మొత్తంగా గొల్ల, కురుమలకు 5,160 యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు 3,865 యూనిట్ల గొర్రెలను సంబంధిత లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన గొల్ల, కురుమలకు ఒక్కో యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక పొట్టేలు కొనుగోలు చేసి పంపిణీ చేసింది. రెండో విడతలో 1296 యూనిట్ల గొర్రెలను సంబంధిత లబ్ధిదారులకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల వ్యవధిలో పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లా పశు సంవర్ధక శాఖ గొర్రెల పంపిణీ కసరత్తులో భాగంగా డీడీలు చెల్లించని సొసైటీ సభ్యుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే ఇతర ప్రాంతాల నుంచి గొర్రెలను జిల్లాకు తరలించటానికి రవాణాకు సంబంధించి వాహన టెండర్లపై జిల్లా శాఖ దృష్టి సారిస్తోంది.

రాయితీ పెంచిన సర్కారు..

రెండో విడతలో గొర్రెల పంపిణీకి ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్ విలువతో పాటు రాయితీ పెంచింది. యూనిట్ విలువ రూ.1.75 లక్షలు కాగా, ఇందులో లబ్ధిదారుడి వాటా 25 శాతం రూ.43,750 డీడీ తీసి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. మిగతా సొమ్ము ప్రభుత్వమే భరించనుంది. గతంలో గొర్రెల యూనిట్ విలువ రూ.1.25 లక్షలు కాగా, ఇందులో లబ్ధిదారుడి వాటా 25 శాతం రూ.31,250 డీడీ తీసి ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండేది. మిగతా సొమ్ము ప్రభుత్వ రాయితీ కింద రూ.93,750 భరించేది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గొర్రెల యూనిట్ల పంపిణీ ఇలా..

మండలం	గొర్రెల యూనిట్లు	పంపిణీ చేసినవి	పంపిణీ చేయాల్సినవి
బాచుపల్లి	51	45	6
దుండిగల్	659	369	290
ఘట్‌కేసర్	1075	850	225
కాప్రా	143	55	88
కీసర	914	779	135
మేడ్చల్	844	734	101
శామీర్‌పేట్	844	451	393
ఎంసీపల్లి	630	573	57
మొత్తం	5,160	3,865	1296